ఇచ్చిన హామీలకు మించి పథకాలు అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి

కలగర (విస్సన్నపేట): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని కలగర పంచాయతీ ములగలపాటివారిగూడెంలో మంగళవారం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి శుభా కాంక్షలు తెలిపారు. ఎన్నికల ముందు ప్రజా సమ స్యలు తెలసుకొని వాటి పరిష్కారానికి నవరత్నాలు లాంటి పథకాలు అమలు చేయడంతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుడి ఇంటివద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలలో ఎన్ని అమలు చేసిందనేది రాష్ట్రప్రజలందరికీ తెలుసన్నారు. మళ్లీ ఇప్పుడు కొత్త హామీలతో ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు లోకేశ్వరరెడ్డి, రామయంద్రారెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ సభ్యురాలు పుల్లమ్మ, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ జగన్
ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేసి చూపించిన డైనమిక్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వీ కన్వెన్షన్ హాల్లో మంగళవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి


నూజివీడు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు

సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తూనే, సంక్షేమంతో ప్రజల ఆలనాపాలన చూస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టో ఒట్టి బూటకమన్నారు. దానిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. విశ్వసనీయతకు మారుపేరయిన జగన్‌మోహన్‌రెడ్డికి 2024ఎన్నికల్లో కూడా ప్రజలు పట్టం కట్టడం ఖాయమని తెలిపారు. ఇక్కడి టీడీపీ ఇన్‌చార్జికి కేంద్రీయ విద్యాలయం మంజూరు కావాలంటే ఏమేమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా గత మూడేళ్లలో ఏ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయలేదన్నారు. కేంద్రం ఎప్పుడు అనుమతినిస్తే అప్పుడు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌లో 26ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మ్యాంగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని, స్టేడియం నిర్మాణానికి తొమ్మిదెకరాల స్థలం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపారాణి, విద్యామౌలిక సదుపాయల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, జెడ్పీటీసీలు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీలు ఆరేపల్లి శిరీష, లంకా నిర్మల, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు, చాట్రాయి మండలాల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, శివ, బాలకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



గోసవీడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం గోసవీడులో పలు ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని మంగళవారం ఘనంగా ఊరేగించారు. విశ్వేశ్వర స్వామి, అక్కలమ్మ, ముత్యాలమ్మ, దేవతమూర్తుల విగ్రహాలను ధ్వజ స్తంభాన్ని, విశ్వేశ్వర స్వామి ఆలయ శిఖరాన్ని, బొడ్డురాయిని ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాలపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. కాగా నూతన ఆలయాల్లో బుధవారం ఉదయం 8 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

స్పందన అర్జీలపై విచారణ



చాట్రాయి: స్పందనలో వచ్చిన అర్జీలపై నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర మంగళవారం విచారణ నిర్వహించారు. చాట్రాయి మండలం పర్వతాపురం, నరసింహారావుపాలెం, సూరంపాలెం గ్రామాలకు చెందిన కల్లెపల్లి రాజేష్, మండా భాస్కరావు, ములగాల సీతారావమ్మలు తమ భూ సమస్యలు పరిష్కరించాలంటూ ఇటీవల స్పందనలో అర్జీలు అందజేశారు. ఈ నేపథ్యంలో సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి విచారణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు విడనాడాలి



తిరువూరు: విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని తిరువూరు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కడిమి పాపారావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో ఇంద్రజాల ప్రదర్శన ఇచ్చారు. ప్రజల బలహీనత ఆధారం చేసుకుని కొందరు మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తున్నారని, వీటిని నమ్మవద్దని పాపారావు సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, జనరల్‌నాలెడ్జ్, చదరంగంలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు, పండ్ల పంపిణీ



నూజివీడు: మండలంలోని తుక్కులూరులోని జీబీఎల్ వృద్ధాశ్రమంలో ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన బెరాకా మినిస్ట్రిస్ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకుడు బేతపూడి విల్సన్‌బాబు వృద్ధులకు మంగళవారం పండ్లు, దుస్తులు, 10 బియ్యం బ్యాగ్‌లను అందజేశారు. తన కుమారుడి ఆరోగ్యం మెరుగుపడిన నేపథ్యంలో 85 మంది వృద్ధులకు సాయం చేసి తన మొక్కు చెల్లించుకున్నారు. వృద్ధుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



• ఆత్మీయ పలకరింపు

విజయవాడలోని నిర్మల్ హృదయ్ భవన్‌ను మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు పడమట సురేష్‌బాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా పలకరించారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి

కలగర(విస్సన్నపేట): అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో ములగలపాటివారిగూడెం గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ బ్రోచర్లు అందజేసి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుడి ఇంటివద్దనే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అనేక సేవలు చేరువ చేయడంతో పాటు రైతులకు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నట్లు తెలిపారు. పేదవిద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ సభ్యురాలు పుల్లమ్మ, కేడీసీసీ డైరెక్టర్ భూక్యా రాణి, నాయకులు శ్రీనివాసరెడ్డి, చెన్నారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ కె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పశు బీమాపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆందోళనలో రైతులు

మైలవరం: వైఎస్సార్ పశు బీమా పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పశు యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రం ఇవ్వాల్సిన ప్రీమియం సొమ్ము ఇవ్వకపోవడంతో పథకం అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం అమలులోకి తీసుకొచ్చి, లబ్ధిదారుల నుంచి ఎటువంటి సొమ్ములు వసూలు చేయకుండా పథకం అమలు చేసింది. ఈ పథకం గత ఏడాది అక్టోబర్‌లో నిలిచిపోయింది. కొత్తగా వైఎస్సార్ పశు బీమా పథకాన్ని కేంద్రం సాయంతో అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు తయారు చేసి ఈ ఏడాది జనవరిలో జీఓ నంబర్-3ను విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పాల ఉత్పత్తి రైతుల నుంచి 20శాతం ప్రీమియం వసూలు చేయనున్నట్లు జీఓలో పేర్కొంది. కొత్త జీఓ ప్రకారం ఆవు, గేదె మాదిరిగా ఎద్దుకు కూడా బీమా వర్తింపజేయనున్నారు. గతంలో మాదిరిగా మూడు పశువులు చనిపోతేనే పరిహారం చెల్లించాలనే నిబంధనను సడలించి ఒక్క పశువు మృతి చెందినా పరిహారం చెల్లించాలని జీఓలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాపై స్పందించకపోవడంతో పథకం అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ వాటా ప్రీమియాన్ని చెల్లించాలని, తద్వారా బకాయి క్లెయిములను చెల్లించాలని పాల ఉత్పత్తి రైతులు కోరుతున్నారు.


మైలవరంలో మేతకు వెళుతున్న పశువులు

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

గంపలగూడెం: విత్తనాల విక్రయం దుకాణాల డీలర్లు తప్పని సరిగా నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాల్సి ఉందని తిరువూరు ఏడీఏ కెనడీ తెలిపారు. గంపలగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని విత్తన దుకాణాల డీలర్లతో విత్తనాల విక్రయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయించిన విత్తనాలకు సంబంధించిన బిల్లులను డీలర్లు తప్పనిసరిగా అందజేయాలన్నారు. హెచ్‌టీ కాటన్(గ్లైసెల్‌బీటీ) విత్తనాలను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో డీలర్లు ఎవరూ ఆ విత్తనాలను విక్రయించవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలను ఎదుర్కొవాలి అన్నారు. వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ కెనడి

మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలి

నూజివీడు: మహనీయుల జీవిత చరిత్రలను నేటి విద్యార్థులు తప్పనిసరిగా చదవడం ద్వారా తెలుసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం ఝాన్సీరాణి జీవితం గురించి విద్యార్థులకు వివరించారు. సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మిపాల్గొన్నారు.

● గొల్లపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాల పాత్రను వివరించారు.



నేడు గడప గడపకు మనప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం పరిధిలో లక్ష్మీపురం, కలగర గ్రామాల్లో బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ప్రజాసమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

సబ్సిడీపై జీలుగల పంపిణీ

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి రైతులకు ఖరీఫ్ సీజన్లో అవసరమైన జీలుగల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై మంగళవారం పంపిణీ చేశారు. 10 కిలోల ప్యాకెట్ ధర సబ్సిడీ పోను రూ.395 చొప్పు న రైతులకు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. రైతులు ఖరీఫ్ సాగుకు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో వెదజల్లి 50శాతం పూత దశ రాగానే భూమిలో కలియదున్నితే నేలకు కావలసిన సేంద్రియ ఎరువును కొంతవరకు అందించడమే కాక, రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చని సూచించారు. గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ సర్వీసులు, సేవలపై బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. డిపో పరిధిలో సర్వీసులు, సేవలు, సమస్యలపై సలహాలు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్నం 12 నుంచి 1.00 గంటల మధ్య 99592 25457కు ఫోన్ చేసి సలహాలు, సమస్యలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశం ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనపై హర్షం

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాలు పాలనకు హర్షం వ్యక్తం చేస్తూ మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలు మైలవరంలో రూ.32 లక్షలు ఎంపీ నిధులతో పూర్తి చేసిన బాలుర హైస్కూల్ అభివృద్ధి పనులను విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించనున్నారు.

లేఅవుట్ స్థలం ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై కేసు

దుందిరాలపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం దుందిరాలపాడులో ఆంజనేయస్వామి గుడివెనుక జగనన్న లేఅవుట్‌ను ధ్వంసం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు మంగళవారం తెలిపారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో 1.25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి గత ఏడాది ఏర్పాటు చేసిన లేఅవుట్లో 80 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఆ స్థలంలో కొంతభాగం విక్రయించిన నెర్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా లేఅవుట్ తిరిగి అక్రమించుకునే ప్రయత్నానికి ఒడికట్టారు. లేఅవుట్లో ప్లాట్లను విభజిస్తూ ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించి ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆదేశానుసారం వీఆర్వో కే వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేర లేఅవుట్ ధ్వంసానికి పాల్పడిన నెర్ల వెంకటేశ్వర్లు, నెర్ల రామకృష్ణ, ట్రాక్టర్ డ్రైవర్ రంగిశెట్టి గోపాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దుక్కి దున్నేందుకు వినియోగించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: పట్టణ పురపాలక సంఘ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణ వేదిక ప్రారంభం

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడిలోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణవేదికను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలసి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామి రెడ్డి, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్ కుమార్, మర్రి రాజశేఖర్ మంగళవారం ప్రారంభించారు. తొలుత అతిథులకు ఆలయ కమిటీసభ్యులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాలతో పూజలు చేశారు. ధర్మకర్తలు వెలమకన్ని సత్యానారాయణ, పార్వతి దంపతులు అతిథులనుసత్కరించి టీటీడీ ఆలయం నుంచి తీసుకొచ్చిన ప్రసాదాలు అందజేశారు. స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఎంపీపీ పొలదుగు జోత్స్న, సర్పంచ్ కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, మండల పార్టీ కన్వీనర్ సాంబశివారావు పాల్గొన్నారు.


వెంకటేశ్వరస్వామి కల్యాణవేదిక ప్రారంభోత్సవంలో ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ జరపాలి

నూజివీడు: ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి పరిధిలో నిర్వహిస్తోన్న ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఎంపీడీఓ కె.వాణి, ఏపీఓ మీనాక్షికి ఫిర్యాదు చేశారు. ఉపాధిపనులకు రాని వారిని పనికి వచ్చినట్లుగా, వచ్చిన వారిని రానట్లుగా ఎఫ్ఏ మల్లవల్లి కన్నయ్య అక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. పనికి వచ్చిన పేదలను అమర్యాదగా పిలుస్తూ , ఎవరైనా ప్రశ్నిస్తే ఏం చేస్తారంటూ దుర్భషలాడుతున్నాడని వివరించారు. ఇప్పటి వరకు పని చేయని వారి నుంచి రూ.లక్షలు వసూలు చేశాడని, ఎవరైనా అడిగితే జాబ్‌కార్డులు తీసివేస్తానంటూ బెదిరిస్తున్నాడని గ్రామానికి చెందిన కందుల శివ శ్రీనివాసరావు, మల్లిబోయినపల్లికి చెందిన ముల్లంగి యోహాన్‌లు వాపోయారు. ఎఫ్ఏ చేసిన అక్రమాలకు సంబంధించి ఆధారాలున్నాయని, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలి

తిరువూరు: విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని తిరువూరు మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ కోరారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సర అడ్మిషన్లకై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని ఎంఈఓ కోరారు. పాఠశాలల్లో నాడు–నేడు కింద చేసిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, మధ్యాహ్న భోజన పథకం , ఉచిత పాఠ్యపుస్తకాలు, హాస్టలు వసతి, యూనిఫాం తదితర సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని ఎంఈఓ సూచించారు.


ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్స్ కరపత్రాల ఆవిష్కరణ